రైతు పైనే బీమా భారం

- రైతులందరికీ ఉచిత పంటల బీమా అందించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నేడు ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడిన కూటమి సర్కారు
- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేలా ఉత్తర్వులు



రబీలో కందులు విత్తుతున్న రైతులు (ఫైల్)

అమరావతి: పంటలకు ఉచిత బీమా ఇక లేనట్లే. లక్షల మంది రైతులపై ఇక బీమా భారం పడనుంది. ఉచిత పంటల బీమా.. రైతులకు ధీమా అన్న మాటలను కూటమి ప్రభుత్వం మరచిపోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి మంగళం పాడింది. రైతులు ప్రీమియం చెల్లిస్తేనే బీమా వర్తించేలా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఇకపై రైతు పంటల బీమా ప్రీమియం కట్టుకోవాల్సి వస్తుంది. ఈ రబీ సీజన్ నుంచి వరి పంటలకు ఎకరాకు పంట రకాన్ని బట్టి రూ.630ల ప్రీమియాన్ని రైతులే చెల్లించాల్సి ఉంటుంది

భారాన్ని మోయాల్సిందే...

ఇప్పటికే వాతావరణం అనుకూలించక పత్తి, మిరప పంటల సాగులో నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో ప్రీమియం తామే కట్టుకోవాల్సి రావటం అదనపు భారంగా పరిణమించింది. గతంలో రుణాలు తీసుకున్న రైతులకు సంబంధిత బ్యాంకులు, సొసైటీలు పంటల బీమాసొమ్ము చెల్లించేవి. ఆ సొమ్మును తర్వాత రైతుల నుంచి వసూలు చేసేవి. దీంతో ఏదైనా విపత్తులతో పంట నష్టపోతే నష్ట పరిహారం సదరు సంస్థల నుంచి అందేది. అయితే రుణాలు తీసుకోని రైతులకు బీమా సొమ్ము వచ్చేది కాదు. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందరి రైతులకు నష్టపరిహారం అందేలా ఉచిత పంటల బీమా పథకాన్ని అమలుచేసి. క్షేత్రస్థాయిలో ఈ–క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకూ ఉచిత పంటల బీమా అమలు చేసింది. దీనిని ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేసింది.

రబీలో వరిసాగు అత్యల్పం

పెదకూరపాడు నియోజకవర్గంలో రైతులు ఖరీఫ్‌లో వరిపంట సుమారు ఆరువేల ఎకరాలలో సాగు చేస్తారు. రబీలో పుల్లశనగ, మినుము, కంది, మొక్కజొన్న పంటలను అధికంగా సాగు చేస్తారు వరిసాగు మాత్రం క్రోసూరు మండలంలోని దొడ్లేరు, ఆవులవారిపాలెం గ్రామాలలో చాలా స్వల్పంగా సుమారు 600 ఎకరాల వరకు సాగుచేస్తారు. ఎక్కువగా సాగు చేస్తే పంటలకు బీమా వర్తింపు లేకుండా అత్యల్పంగా సాగుచేసే వరిమాత్రమే ఇవ్వటంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన ప్రభుత్వం పంటలబీమా పథకాన్ని రైతులపై భారం పడకుండా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.





అదనపు భారమే..

ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు అనుకూలించక నష్టాలు వస్తున్నాయి. సాగులో పెట్టుబడుల భారం పెరిగి రైతుల పరిస్థితి నానాటికీ తీసికట్టుగా ఉంది. గతంతో పోల్చుకుంటే రానురానూ పెట్టుబడి వ్యయం పెరిగి అప్పులు మిగులుతున్నాయి. ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక మొత్తానికి వడ్డీలు తెచ్చుకోవాల్సి వస్తోంది. దీనికి తోడు బీమా ప్రీమియం చెల్లింపు అదనపు భారం కానుంది. రైతులపై ప్రీమియం భారం లేకుండా చూడాలి.

– జెట్టి నాగరాజు, రైతు, జూపూడి



బీమా భారాన్ని మోపడం బాధాకరం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు చేదోడు వాదోడుగా ఉండేది. పెట్టుబడి సాయం, ఉచిత పంటల బీమా పథకం, రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ అవసరాలు తీర్చడం వంటి పనులు చేసింది. రైతులకు అత్యంత ప్రయోజకరంగా ఉచిత పంటల బీమా ఉండేది. అలాంటి పరిస్థితులు లేకుండా పోయాయి. రైతులు సాగు ఖర్చులకు అప్పులబాట పట్టాల్సి వస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులపైనే బీమా భారాన్ని మోపడం బాధాకరం.

– అలా లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ రైతు నాయకుడు, అమరావతి

బాల్య వివాహ రహిత భారత్‌కు కృషి



గోళ్ళపాడు కేజీబీవీలో ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ అప్పమ్మ, సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, జయలక్ష్మి

సత్తెనపల్లి: బాల్య వివాహ రహిత భారత్‌కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ప్యానల్ న్యాయవాది డి.శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు బాల్య వివాహ రహిత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించి బాల్య వివాహాల వలన జరిగే దుష్పరిణామాలు, అనర్థా లను వివరించడం జరుగుతుందన్నారు. ఫిజియోథెరపీ వైద్యురాలు జీవన జ్యోతి, పారా లీగల్ వలంటీర్ షేక్ సుభాని, తదితరులు ఉన్నారు.

గోళ్లపాడులో...

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): బాల్య వివాహాలు నేరమని, ఒక సాంఘీక దురాచారమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనంతలక్ష్మి, జయలక్ష్మిలు చెప్పారు. మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాలలో బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రతిజ్ఞ, అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్లు అనంతలక్ష్మీ, జయలక్ష్మీలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సాధ్యమైనంత గా ప్రయత్నం చేస్తానంటూ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ సర్పంచ్ గోపు అప్పమ్మ, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆరోగ్య కార్యకర్త కరిముల్లా, అంగన్‌వాడీ కార్యకర్తలు, కేజీబీవీ ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రాజుపాలెంలో....

రాజుపాలెం: బాల్య వివాహాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పెదనెమలిపురి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం నాగమణి తెలిపారు. పాఠశాల విద్యార్థులతో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నినాదాలు చేసుకుంటూ గ్రామ పురవీధుల్లో ర్యాలీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకుల్లో పొదుపు ఎంతో మేలు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ల్యాంపు సంస్థ సభ్యులు, బ్యాంకు మేనేజర్లు

ముప్పాళ్ళ: ప్రభుత్వ బ్యాంకుల్లో పొదుపు చేసుకోవటం ఎంతో మేలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ముప్పాళ్ల శాఖ మేనేజర్ బి.సందీప్ చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం రైతు భరోసాకేంద్రంలో భారతీయ రిజర్వ్‌బ్యాంకు వారి సౌజన్యంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఖాతాదారుల చైతన్య మరియు అవగాహన సదస్సుపై శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సందీప్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ప్రభుత్వ బ్యాంక్ ద్వారానే లావాదేవీలు జరపాలని, ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష లాంటి ఇన్స్యూరెన్స్ లు కలిగి ఉండాలని, డిజిటల్ పేమెంట్స్ గురించి పూర్తిగా తెలుసుకోవాలన్నారు. సెంట్రల్ బ్యాంక్ మేనేజర్ డి.రవికుమార్ మాట్లాడుతూ వడ్డీతో కూడిన పొదుపు మరియు రక్షణ ప్రభుత్వ బ్యాంకుల ద్వారానే సాధ్యమన్నారు. కోటక్ మహీంద్రా బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ టీబీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల జీవనప్రమాణాలును పెంపొందించుకోవడానికి ప్రభుత్వ బ్యాంకుల ద్వారానే లావాదేవీలను జరపాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ల్యాంప్ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ రిజర్వుబ్యాంకు ఉద్దేశం ప్రకారం ప్రతి బ్యాంకులో ఉండే నిరర్ధక ఖాతాల నుంచి వచ్చిన డబ్బుతో గ్రామాల్లో సదస్సులు ఏర్పాటు చేసి ఖాతాదారులు మోసపోకుండా ఉండటానికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. సైబర్ నేరాల వలన ఆంధ్రప్రదేశ్‌లో రూ.800కోట్ల ప్రజల సొమ్ము నష్టం జరిగిందన్నారు. కార్యక్రమంలో భాగంగా భారత రిజర్వుబ్యాంక్ రూపొందించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ల్యాంప్ సంస్థ రీసోర్స్ పర్సన్ ఎస్‌కే బాజీ, తురకా మంగయ్య, వెలుగు కమ్యూనిటీ కోఆర్డినేటర్ సీహెచ్‌సౌభాగ్యం, మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, షేక్ భాను, డ్వాక్రా సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతులకు పథకాలపై అవగాహన

రాజుపాలెం: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని దానికి తగినట్లుగా పంటలు వేసుకుని సేంద్రియ ఎరువులను వాడాలని డీబీఆర్‌సీ రీజనల్ కో–ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలోఎస్సీ, ఎస్టీ రైతులకు, కౌలు రైతులకు ఉపాధి హామీ పథకంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లెల చిన్నప్ప మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులకు, కౌలు రైతులకు ప్రభుత్వ పథకాల ద్వారా వచ్చే సబ్సిడీల గురించి వివరించారు. రైతులకు కావాల్సిన ఎరువులను రైతు భరోసా కేంద్రాలలో లభిస్తాయని సూచించారు. ఏపీఓ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి పథకం ద్వారా రైతులు17 రకాల పండ్ల తోటలను, రెండు రకాల పూల తోటలను సాగు చేసుకోవచ్చని తెలిపారు. వీటిపై సబ్సిడీ కూడా ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. అంతేగాక గడ్డి పెంపకం, వ్యక్తిగత ఇంకుడు గుంతలు, సబ్సిడీపై ఉపాధి పథకం ద్వారా చేసుకోవచ్చని తెలిపారు. చదువుకున్న పిల్లలకు వివిధ ఉద్యోగాలకు సంబంధించి 90 రోజుల ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. డీబీఆర్‌సీ ఏరియా కో–ఆర్డినేటర్ గడ్డిపర్తి వెంకటరత్నం, ఎస్సీ, ఎస్టీ రైతులు పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులను ఆదరించాలి

సత్తెనపల్లి ఉప విద్యాశాఖ అధికారి ఏసుబాబు



కార్తిక వనభోజనాల సందర్భంగా మాట్లాడుతున్న ఉప విద్యాశాఖ అధికారి ఏసుబాబు

సత్తెనపల్లి: పుట్టుకతోనే చెవిటి, మూగ, మానసిక దివ్యాంగులుగా జన్మించిన చిన్నారులను ప్రతి ఒక్కరూ ఆదరించి అక్కున చేర్చుకోవాలని సత్తెనపల్లి ఉపవిద్యా శాఖ అధికారి వి.ఏసుబాబు అన్నారు. కార్తిక మాసంను పురస్కరించుకొని పట్టణంలోని పరివర్తన చెవిటి, మూగ, మానసిక వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో లిటిల్ ఏంజెల్స్ ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠశాల విద్యార్థులు, డైరెక్టర్ల సహకారంతో బుధవారం కార్తిక మాస వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వి.ఏసుబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పుట్టుకతోనే మానసిక దివ్యాంగులుగా జన్మించిన చిన్నారులు దైవంతో సమానమన్నారు. అటువంటివారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదిగేలా ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల నృత్య ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. పరివర్తన నిర్వాహకుడు కె.కిషోర్‌బాబు, వై.మేరీ, ఎస్.కుసుమకుమారి, లిటిల్ ఏంజెల్స్ డైరెక్టర్లు భవనం నాగిరెడ్డి, షేక్ చిన్న మౌలాలి, తుమ్మల సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల లక్ష్యాలను చేరుకోవాలి

సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన వంద రోజుల్లోపు కార్యక్రమంలో భాగంగా పక్కా గృహ నిర్మాణాల లక్ష్యాన్ని పూర్తి చేయాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్‌నగర్‌లో గల తన కార్యాలయంలో బుధవారం గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్ష చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన పక్కాగృహాల నిర్మాణాలు ఎంతవరకు వచ్చాయని ఆరా తీశారు. సొంత స్థలం ఉండి పక్కా గృహం నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్న వారి వివరాలను సేకరించాలన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నియోజకవర్గానికి అధిక సంఖ్యలో పక్కా గృహాలు మంజూరయ్యేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. పక్కా గృహం మంజూరై ఇప్పటి వరకు పనులు ప్రారంభించని వారిని చైతన్య పరిచి సొంతింటి కలను సాకారం చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ డీఈ వి.శ్రీనివాసరెడ్డి, ఏఈలు సుబ్బారావు (సత్తెనపల్లి), మాధవి(ముప్పాళ్ళ), జోజి(రాజుపాలెం), రాములు నాయక్ (నకరికల్లు) తదితరులు ఉన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'



ఇరుకుపాలెంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ అరుణ

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని మాదల, ఇరుకుపాలెం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ పాల్గొని తుఫాన్ బారినుంచి పంటలను కాపాడుకునే విధానాలపై రైతులకు అవగాహన కల్పించారు. మొక్కజొన్నలో కత్తెర పురుగు పరిశీలనకు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు పెట్టాలని సూచించారు. జీవన ఎరువులైన వీఏఎం(మైకోరైజ్), కేఆర్‌బీ(పొటాషియం రిలీసింగ్ బ్యాక్టీరియా), పీఎస్‌బీ(ఫాస్పేట్ కరిగే బ్యాక్టీరియా) ఉపయోగించడం ద్వారా మందు కట్టల వాడకం 40శాతం తగ్గించవచ్చన్నారు. నేలలో సేంద్రియ కర్బనం పెంచుకోవడం వల్ల గ్లోబల్‌వార్మింగ్ వల్లే వచ్చే నష్టాన్ని తగ్గించవచ్చన్నారు. మొక్కజొన్న, శనగ వేసే రైతులు విత్తన ఎంపికలో జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయ సహాయకులు కె.నరేష్, బీవీ నారాయణ, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నకరికల్లు: వాయుగుండం హెచ్చరికల నేపథ్యంలో రైతులు వరికోత యంత్రాల ద్వారా కోతలు కోయించాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు రైతులకు సూచించారు. మండలంలోని చీమలమర్రి, చల్లగుండ్ల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించిందన్నారు.గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, రైతులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యూటీఎఫ్ స్వర్ణోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ

అచ్చంపేట: డిసెంబర్ 1న పల్నాడు జిల్లా కేంద్రమైన నర్సరావుపేట ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరిగే ఏపీ ఐక్య ఉపాధ్యాయ స్వర్ణోత్సవ జిల్లా మహాసభకు యూటీఎఫ్ ఉపాధ్యాయులంతా తరలి వచ్చి జయప్రదం చేయాలని మండలశాఖ అధ్యక్షుడు ఆళ్లమూడి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా బుధవారం స్థానిక విద్యావనరుల కార్యాలయం వద్ద వాల్ పోస్టర్లు విడుదల చేశారు. గౌరవాధ్యక్షుడు తుమ్మా శౌర్రెడ్డి, యూటీఎఫ్ మండల శాఖ సభ్యులు పాల్గొన్నారు.

డిసెంబర్ 20 లోపు 'అపార్' పూర్తి చేయాలి

ఎంఈఓ ఏకుల ప్రసాదరావు

క్రోసూరు: డిసెంబర్ 20వ తేదీలోపు అపార్ నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని ఎంఈఓ–1 ఏకుల ప్రసాదరావు, ఎంఈఓ–2 గణేష్ తెలిపారు. బుధవారం విద్యావనరుల కేంద్రంలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ అపార్ నియమావళి పై అవగాహన కల్పించారు. ఆధార్ కార్డు మాదిరిగా వన్‌నేషన్ వన్ ఐడీ పేరుతో 17 అంకెల గుర్తింపు కార్డు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధం చేసిందన్నారు. ప్రతి విద్యార్థి జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు వివరాలు పాఠశాల కార్యాలయంలో అందచేస్తారని, దానిలో వివరాలన్నీ ఒకే విధంగా ఉండేవిధంగా చూడాలన్నారు. అపార్ కార్డు ఐడీ ఇచ్చిన తరువాత మార్పులు చేసేందుకు వీలుపడదన్నారు. తల్లిదండ్రుల పేర్లు, విద్యార్థి పేరు, పుట్టిన తేదీ, ఆధార్‌నంబర్ అన్నీ ఒకేవిధంగా ఉండాలన్నారు. ఒక వేళ లేకుంటే తల్లిదండ్రులు సరిచేయించి ఇవ్వాలని కోరారు. వచ్చేనెల 20 లోపు పాఠశాలల కార్యాలయాల్లో నమోదు ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాదిపాడులో సహస్ర దీపోత్సవం



అచ్చంపేట: కార్తిక ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని మాదిపాడులోగల అభయాంజనేయస్వామివారి దేవాలయంలో మంగళవారం రాత్రి భక్తులు సనాతన సహస్ర దీపోత్సవం చేపట్టారు. పలువురు భక్తులు పగలంతా కార్తిక ఏకాదశి ఉపవాసాలుండి సాయంసమయానికి స్వామివారి దేవాలయానికి చేరుకున్నారు. రామలింగేశ్వరస్వామి భజన సమాజం, గ్రామపెద్దలు, అర్చకస్వామి వేదాంతం పవన్‌కుమార్ ఆచార్యులు, ఆర్యవైశ్య ప్రముఖులు దేవరశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సనాతన సహస్ర దీపోత్సవం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రత్యేకంగా శివలింగం, పానివట్టం, శంఖు,చక్ర, నామాల ఆకృతితో దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగ ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి నక్షత్ర హారతి, నాగహారతి, కుంభ హారతులు ఇచ్చారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన



సత్తెనపల్లి: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణంలోని నారాయణ పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రుతస్ గోల్డ్ మెడల్, ఎండి.ఫరూక్ సిల్వర్ మెడల్, సలివేంద్ర హేమల్ బ్రాంజ్ మెడల్, దూలం భాస్కర్ బ్రాంజ్ మెడల్, రాజారపు యశ్విని బ్రాంజ్ మెడల్ కై వసం చేసుకున్నారు. రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు కైవసం చేసుకున్న విద్యార్థులను, తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దరువూరి నాగేశ్వరరావు, స్కూల్ యాజమాన్యం, నాయకులు, పాల్గొన్నారు.

ముప్పాళ్ల ఏఎస్ఐగా మాధవరావు



ముప్పాళ్ళ: ముప్పాళ్ళ పోలీస్‌స్టేషన్ ఏఎస్ఐగా మక్కెన మాధవరావు బాధ్యతలు స్వీకరించారు. ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్‌లోనే హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న మక్కెన మాధవరావుకు ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. పనిచేస్తున్న స్టేషన్‌లోనే పదోన్నతిపై రావటంపై సహచర సిబ్బంది అభినందనలు తెలిపారు.

అడవిజాతి మొక్కల పెంపకంపై అవగాహన

తొండపి(ముప్పాళ్ళ): అటవీయేతర ప్రాంతంలో చెట్ల పెంపకం కార్యక్రమంలో భాగంగా తొండపి గ్రామంలో అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమంలో ట్రీస్ అవుట్‌సైడ్ ఫారెస్ట్ ఇన్ ఇండియా ప్రోగ్రాం స్టేట్ అసోసియేట్ మారపల్లి ప్రణీత్‌వర్మ పాల్గొని ఉద్యానవన మొక్కలు, అడవిజాతి మొక్కలను వ్యవసాయభూమిలో నాటడం వలన కలిగే ఉపయోగాలను, అదనపు ఆదాయం గురించి అవగాహనతో పాటుగా శిక్షణ అందించారు. ఉద్యానవనశాఖ అసిస్టెంట్ జి.రాజేష్, సీసీ మణికంఠ, అనిల్, వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి

అమరావతి: స్థానిక పాండురంగస్వామి దేవాలయంవీధిలో పాముకాటుకు మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. పాండురంగస్వామి గుడివీధిలో నివాసం ఉండే చెవిటికంటి జయ(58) బుధవారం ఉదయాన్నే ఇంట్లో గులాబీ చెట్టుకు ఉన్న పూలను కోస్తుంటే పాముకాటు వేసింది. ఈనేపథ్యంలో పాము కాటును గుర్తించని ఆమె ముల్లు గుచ్చుకుందని భావించి ఇంట్లో పనులు చేసుకుంటుండగా నోటిలో నురగరావటంతో ప్రైవేటు హస్పటల్‌కు తరలించారు. అక్కడి నుంచి స్థానిక సీహెచ్‌సీ తరలించి పాముకటుకు విరుగుడు ఇంజక్షన్‌లు చేసిచికిత్స అందించారు. అయినప్పటికీ ఆమె ఆరోగ్యపరిస్థితి విషమించటంతో గుంటూరులోని ఓప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బాలల రక్షణ కమిటీలు పటిష్టం చేయాలి

క్రోసూరు: అమరావతి గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో క్రోసూరు–1 సచివాలయంలో గ్రామస్థాయి బాలల రక్షణ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి సంస్థ మండల ఇన్‌చార్జ్ తండు లక్ష్మణ్ అధ్యక్షత వహించగా పంచాయతీ కార్యదర్శి వెంకయ్య మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణకు గ్రామస్థాయిలో బాల రక్షణ కమిటీలు బలోపేతం చేయాలన్నారు. సంస్థ డైరెక్టర్ సిస్టర్ విన్నరసి, సచివాలయం–2 కార్యదర్శి ఆదినారాయణ, మహిళా పోలీసులు, ఆశ వర్కర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి.షమ్మి బుధవారం తెలిపారు. సమావేశంలో అజండాలోని అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. సమావేశానికి ఎక్స్ అఫిషియో హోదాలో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ హాజరవుతారన్నారు. పట్టణంలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, కో–ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్లు హాజరు కావాలని ఆయన కోరారు.

హిందూ ధర్మ రక్షణకు పనిచేయాలి



అమరావతి: సమరసత సేవా ఫౌండేషన్ మహిళా విభాగం ఆరు జిల్లాల మహిళా శిక్షణా కార్యక్రమం స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్లూరు విష్ణు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మండల మహిళా కన్వీనర్లు గ్రామాలలో హిందూ ధర్మ రక్షణ కోసం నిరంతరం పనిచేయాలన్నారు. తొలుత ఉదయం ఏడు గంటలకు అమరేశ్వర స్వామి గాలిగోపురం వద్ద నుంచి భారీ నగరసంకీర్తన నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు కోయ సురేష్, గోగినేని వెంకటరమణ, పులిపాటి వెంకట పవన్ కుమార్, కోలా వెంకటేశ్వరరావు, బూసి శ్రీనివాసరావు , వడ్లమూడి అశ్విని తదితరులు పాల్గొన్నారు

కరెంట్ బిల్లు విషయంలో లైన్‌మెన్‌పై దాడి

సత్తెనపల్లి: కరెంట్ బిల్లు విషయంలో లైన్‌మెన్‌పై దాడి జరిగిన ఘటన పట్టణంలో బుధవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని 12వ వార్డుకి చెందిన లోక మాధవకు పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో విద్యుత్ సామగ్రి విక్రయ దుకాణం ఉంది. ఆ దుకాణానికి సంబంధించిన కరెంట్ బిల్ పెండింగ్ ఉందని పాత బస్టాండ్ ఏరియా లైన్‌మెన్ శేషు కుమార్ అడగడంతో పాటు బిల్ చెల్లించకపోతే ఫీజు కట్ చేస్తానని హెచ్చరికలు చేయడంతో చివరికి వారి మధ్య వాదోపవాదనలు జరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో శేషుకుమార్‌కి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో విద్యుత్ శాఖ అధికారులు ఫిర్యాదు చేశారు.

పేకాట స్థావరంపై దాడి

రూ.20,150 స్వాధీనం

క్రోసూరు: క్రోసూరు ఎస్ఐ కె.నాగేంద్రరావు, పోలీసు సిబ్బంది బుధవారం స్థానిక మోడల్ స్కూల్ వెనుక వైపు పొలాల్లో పేకాటస్థావరంపై దాడి చేసి పేకాటరాయుళ్లు 8 మందిని అదుపులోకి తీసుకుని రూ.20,150 స్వాధీన పరుచుకున్నారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా పేకాట, కోడిపందేలు, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా బెల్ట్‌షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.